అధికారులు సమయపాలన

కచ్చితంగా పాటించాలి

కలెక్టరేట్ ఉద్యోగులకు సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు సమయపాలన కచ్చితంగా పాటించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వివిధ శాఖల అధికారులు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టంచేశారు. బయోమెట్రిక్ హాజరు ఇప్పటివరకు రిజిస్టర్ చేసుకోని అధికారులు వెంటనే రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు అనుసరించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి

రూ.34 లక్షల చెక్కు



హోంగార్డు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఇటీవల మృతి చెందిన హోంగార్డు మచ్చేందర్ కుటుంబానికి యాక్సెస్ బ్యాంకు నుంచి ప్రమాద బీమా కింద రూ.30 లక్షలు, ఇద్దరు పిల్లల చదువు కోసం రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.34 లక్షల చెక్కును సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. అందజేశారు. పోలీసు సాలరీ ప్యాకేజీ గురించి డిపార్ట్‌మెంట్‌లో ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా బ్యాంకులలో ఉన్న సాలరీ అకౌంట్లను పోలీసు సాలరీ ప్యాకేజ్ లోకి మార్చుకోవాలసిందిగా సూచించారు. పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. పోలీసుశాఖ నుంచి రావలసిన అన్నిరకాల బెనిఫిట్స్‌ను త్వరితగతిన అందజేసే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. మచ్చేందర్ కుటుంబానికి యాక్సిడెంటల్ బెనిఫిట్స్‌ను సకాలంలో అందించిన యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్, యాజమాన్యాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఈ కల్యాణి, ఆర్ఐలు డానియెల్, రాజశేఖర్‌రెడ్డి, యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



గృహజ్యోతి దూరం

పేదలకు ఉచిత విద్యుత్ అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంపై భానుడి ప్రభావం పడింది. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతకు విద్యుత్ వినియోగం పెరిగి మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. పరిమితికి మించి కంరెంటు వాడుతండటంతో లబ్ధిదారులు ఉచిత విద్యుత్‌కు దూరమవుతున్నారు.

- ఉచిత విద్యుత్‌పై సమ్మర్ ఎఫెక్ట్
- 200 యూనిట్లు దాటుతున్న వినియోగం
- పరిమితి మించడంతో వర్తించని సబ్సిడీ
- వినియోగదారులపై బిల్లుల భారం
- మెదక్ జిల్లాలో 11 వేల మంది పథకానికి దూరం

మెదక్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించేవారికి జీరో బిల్లు ఇస్తున్నది. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ప్రజలు కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తుండడంతో విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటుతోంది. దీంతో ఉచిత విద్యుత్ పథకానికి దూరమవుతున్నారు. పరిమితికి మించి వినియోగిస్తున్న వేలాది మంది బిల్లులు చెల్లించాల్సి వస్తోంది.

అధిక ఉష్ణోగ్రతల ప్రభావం

మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నుంచే పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువే నమోదవుతున్నాయి. దీంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. వేసవి తాపం కారణంగా కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం పెరిగింది. దీంతో, విద్యుత్ మీటర్ రీడింగ్ 200 యూనిట్లు దాటుతోంది. పిల్లలకు వేసవి సెలవులు ఉండడంతో టీవీలకు అతుక్కుపోతున్నారు. టీవీల ప్రభావం కూడా విద్యుత్ వినియోగంపై పడినట్లుగా తెలుస్తోంది.

యూనిట్ కేటగిరీ ఇలా..

విద్యుత్ యూనిట్ ధర సాధారణంగా 1 నుంచి 50 యూనిట్ల వరకు రూ.1.95 నిర్ధారించారు. 51 నుంచి 100 వరకు రూ.3.10, 101 నుంచి 200 యూనిట్ల వరకు రూ.4.80, 200 యూనిట్ల దాటితే రూ.5.10 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 200 యూనిట్లు దాటిన వారికి రూ. వెయ్యికి పైగా బిల్లు వస్తున్నది. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, బల్బులు, ఫ్యాన్లు ఉంటే సాధారణంగా 100 నుంచి 150 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తారు. కానీ, వేసవి తాపంతో మార్చి నుంచి ఈ వినియోగం పెరిగింది. సగటు వినియోగం 150-200 యూనిట్లకు పెరిగింది. ఈ కారణంగా జిల్లాలో 11 వేల మంది లబ్ధిదారులు ఉచిత విద్యుత్‌కు దూరమయ్యారు. జిల్లాలో గృహజ్యోతి అర్హులు 1,31,950 మంది ఉన్నారు. వీరిలో ఫిబ్రవరి నెలలో 1,418, మార్చిలో 1,457, ఏప్రిల్‌లో 3,807, మే 4,557 మొత్తం 11,239 మంది వినియోగదారులు ఈ పథకానికి దూరమయ్యారు.

విద్యుత్ వినియోగం పెరిగింది

ఎండల తీవ్రత కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. నెలకు 200 యూనిట్లలోపు వాడిన వారికి గృహజ్యోతి పథకం వర్తిస్తోంది. దాటిని వినియోగదారులకు వర్తించదు.

-శంకర్ ట్రాన్స్‌కో ఎస్ఈ, మెదక్



'ఖేడ్' డిపోలో నేడు

డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం మల్లేషయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణఖేడ్ డీపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజలు 9063417161 నెంబరుకు ఫోన్ చేసి ఆర్టీసీకి సంబంధించిన సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులున్నా తెలపాలని కోరారు. మరింత మెరుగైన సేవలు అందించడానికి సూచనలు, సలహాలను ఇవ్వాలని కోరారు.

15న ఉచిత

నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్, మే 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని సత్యసాయి మందిరంలో ఈ నెల 12న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి బాధ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా చికిత్సలు అందజేస్తామని పేర్కొన్నారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం 9676171527 నంబరులో సంప్రదించాలని కోరారు.

మైనింగ్ మాయ..
మట్టి మాఫియా
- రాంపూర్‌లో ఆగని దందా
- పట్టించుకోని అధికారులు

ఇష్టారాజ్యంగా నల్లమట్టి తరలింపు 7లో



హైవేల విస్తరణతో
అభివృద్ధికి బాటలు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7లో



టీబీ బాధితుల రికార్డులు
సక్రమంగా నిర్వహించాలి
- డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు 7

నాలుగోసారి
తైబజార్ వేలం వాయిదా 8



ఏటీసీ సిద్ధం

సంగారెడ్డిలో త్వరలో అందుబాటులోకి

'టాటా' సహకారంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు

నైపుణాభివృద్ధికి బాట.. ఉపాధికి బాసట

ఆరు ట్రేడ్లలో వివిధ అంశాలపై శిక్షణ

ఏటీసీల ఏర్పాటుతో ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ

సంగారెడ్డి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక నైపుణ్యం పెంపొందించడం ద్వారా యువతకు స్వయంఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడం కోసం ప్రభుత్వం ఐటీఐలను బలోపేతం చేయాలని నిర్ణయించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అవసరమైన సాంకేతిక అంశాలపై శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటరు(ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకున్నది. ఇందుకోసం టాటా టెక్నాలజీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈమేరకు సంగారెడ్డి జిల్లాలో మూడు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నారు. సంగారెడ్డి, రామచంద్రాపురం, హత్నూర ప్రభుత్వ ఐటీఐ కళాశాల (ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ) ప్రాంగణాల్లో ఏటీసీ నిర్మాణానికి గతేడాది చర్యలు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. ఒక్కో ఏటీసీకి సుమారు రూ.4.7 కోట్లతో భవనం నిర్మిస్తుండగా, శిక్షణ ఇచ్చేందుకు కంప్యూటర్ న్యూమరికల్స్(సీఎన్‌సీ) మిషన్స్‌తో పాటు ఆధునిక యంత్ర పరికరాలను ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ద్వారా సమకూరుస్తున్నారు.

చకచకా పనులు

ఈమేరకు సంగారెడ్డిలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏటీసీ నూతన భవనానికి గతేడాది జూన్‌లో శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఏటీసీ నిర్మాణ పనులు తది దశకు చేరుకున్నాయి. యంత్ర పరికరాల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి, త్వరలో ఏటీసీ భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసువచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



సంగారెడ్డి ఏటీసీలో అమర్చిన యంత్రాలు

సాంకేతిక అంశాలపై శిక్షణ

ఏటీసీ ఏర్పాటులో భాగంగా ఆరు ట్రేడ్లతో 2024-25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభించారు. 172 మంది విద్యార్థులు ఆయా ట్రేడ్లలో అడ్మిషన్లు పొందారు. వచ్చే విద్యాసంవత్సరం మరో 172 మందికి అడ్మిషన్లు కల్పించనున్నారు. కొత్త ట్రేడ్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏటీసీలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు టాటా టెక్నాలజీ సంస్థతో పాటు ఇతర పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఏటీసీలతో ఐటీఐలకు మహర్దశ

ఐటీఐ విద్యార్థులను పరిశ్రమలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఐటీఐలకు అనుబంధంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నెలకొల్పనున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుండటంతో పరిశ్రమల్లో అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఐటీఐ కళాశాలల్లో ఇందుకు అనుగుణంగా యంత్ర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లాలో మూడు ప్రభుత్వ 15 ప్రైవేటు ఐటీఐ కళాశాలలున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఏటీసీల ఏర్పాటుతో మెరుగైన శిక్షణ అందనున్నది.

జొన్న రైతుల నిలువు దోపిడీ

- క్వింటాలు జొన్నలకు 5-6 కిలోల తరుగు
- హమాలీ అదనం
- ప్రభుత్వ మద్దతు ధర రూ.3,371
- తరుగు, హమాలీ పేరిట రూ.300 కోత
- రోజుల తరబడి నిరీక్షణ
- వాహన చార్జీల భారం



మనూరులోని జొన్నల కొనుగోలు కేంద్రం

మనూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతుధర అందించడం కోసం ప్రభుత్వం పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నది. కానీ కొన్ని కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను నిలువుగా దోచుకుంటున్నారు. మండల కేంద్రమైన మనూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.3,371 మద్దతు ధర ప్రకటించింది. బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ ధర దక్కుతుండటంతో రైతులు జొన్నలను కొనుగోలు కేంద్రానికే తీసుకువెళ్తున్నారు. కానీ, అక్కడ క్వింటాలు జొన్నలకు ఐదు నుంచి ఆరు కిలోలు తరుగు తీస్తున్నారు. హమాలీ పేరిట క్వింటాలకు రూ.80 వసూలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరలో రూ.300 వరకు రైతులు కోల్పోతున్నారు. వచ్చిన దాంట్లోనూ రవాణా ఖర్చుల కోసం మరికొంత పోతున్నది. కేంద్రంలో మూడు నాలుగు రోజులు వేచి ఉండటంతో అన్ని రోజులకు కిరాయి చెల్లించాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. దీనికితోడు కేంద్రాలకు తీసుకువచ్చిన జొన్నలను వాహనాల నుంచి కేంద్రంలోకి రైతులే చేరవేయాల్సి వస్తున్నదని పలువురు తెలిపారు. హమాలీ చెల్లించినా రైతులతో పని చేయిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం స్థానికంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా నిర్వాహకులు, అధికారుల అవినీతి కారణంగా మద్దతు ధర మాత్రం అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కేంద్రానికి తెచ్చిన జొన్నలను ట్రాక్టర్ నుంచి స్వయంగా దింపుతున్న రైతులు

రైతులను దోచుకుంటున్నారు



రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్ధతు ధర ప్రకటించింది. కానీ నిర్వాహకులు మాత్రం మద్దతు ధరలో కోత పెడుతున్నారు. క్వింటాల్ జొన్నలకు 5-6 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. దీనిపై ప్రశ్నించే వారు కరువయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి క్రేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

- గోపాల్, రైతు, శెల్గిర

దళారుల కంటే ఎక్కువ మోసం



దళారుల చేతిలోపడి మోసపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా అధికారులు, నిర్వాహకులు దళారుల కంటే ఎక్కువ మోసం చేస్తున్నారు. తరుగు, హమాలీ పేరిట ఇష్టం వచ్చినంత కోత పెడుతున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు కానీ, ఉన్నతాధికారులు కానీ చర్యలు తీసుకోవడం లేదు.

- ఆనంద్, రైతు, శెల్గిర



బచ్చురాజుపల్లి కొనుగోలు కేంద్రంలో విచారణ చేస్తున్న జిల్లా అధికారుల బృందం

కొనుగోలు కేంద్రంలో

అక్రమాలపై కొరడా

ధాన్యం తూకంలో మోసంపై విచారణ

వెలుగు వీఏవోపై సస్పెన్షన్ వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలపై అధికారులు కొరడా ఝళిపించారు. రైతుల ఆందోళనలపై స్పందించి బాధ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు. నిజాంపేట మండలం బచ్చురాజు పల్లి కేంద్రంలో కొద్దిరోజులుగా 40 కిలోల బస్తాకు 4 కిలోలు అధికంగా తూకం వేస్తున్నారు. ఈ విషయాన్ని ఆదివారం రైతులు గుర్తించి ఆందోళన చేశారు. నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై 'కొనుగోలు కేంద్రాల్లో ఆగని అక్రమాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. దీంతో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, డీఎస్‌వో సురేష్ రెడ్డి, సివిల్‌సప్లై జిల్లా అధికారి జగదీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం బచ్చురాజు కేంద్రాన్ని సందర్శించి విచారణ జరిపారు. రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అధికంగా తూకం వేయడం నిజమేనని గుర్తించి, ఇందుకు కారణమైన వెలుగు వీఏవో మంజులను సస్పెండ్ చేస్తున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లారీలు లేక నిలిచిన తూకం

దండుపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

మనోహరాబాద్ మే 12 (ఆంధ్రజ్యోతి): లారీల కొరతతో కోనుగోలు కేంద్రం వద్ద ధాన్యం సేకరణ నిలిచిపోయింది. మండలంలో ఈ యాసంగి సిజన్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పోతారం, దండుపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పర్కిబండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో మరో సెంటర్ ఏర్పాటు చేశారు. దండుపల్లి వద్ద ఏర్పాటు చేసిన కోనుగోలు కేంద్రంలో లారీలు లేకపోవడంతో ధాన్యం తూకం నిలిచిపోయింది. కోనుగోలు కేంద్రానికి మూడు లారీలను కేటాయించారు. తూకం వేసిన వడ్లను తూప్రాన్‌లోని సాయినాథ్, వనదుర్గ రైస్‌మిల్లుకు తరలిస్తున్నారు. మిల్లులకు వడ్లు తీసుకువెళ్లిన లారీలు మూడు రోజులవుతున్నా తిరిగిరాకాపోవడంతో సెంటర్‌లో కొత్తగా వడ్లు తూకం వేయడం లేదు. కేంద్రం వద్ద వడ్లు ఆరబోసిన రైతులు తూకం ఎప్పుడు వేస్తారా అని పడిగాపులు కాస్తున్నారు. తేమ శాతం పరిశీలించి ఐదు రోజులవుతున్నా తూకం మాత్రం వేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఓవైపు అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నా కేంద్రం నిర్వాహకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి తూకం వేయకపోతే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయంపై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రమేష్‌ను వివరణ కోరగా లారీల కొరతతో తూకం ఆలస్యమవుతున్నదని, ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలిజేశామని పేర్కొన్నారు. రైస్‌మిల్లుల వద్ద లారీలు ఖాళీ చేయడం ఆలస్యమవుతున్నదని తెలిపారు.



దండుపల్లిలో కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డు పైనే ఉన్న ధాన్యం కుప్పలు



రెండేళ్లయినా పూర్తి కాని పనులు

- చోద్యం చూస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

నారాయణఖేడ్, మే 12(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల మధ్య రాకపోకలకు ఉపయోగపడే నారాయణఖేడ్ - సిర్గాపూర్ రహదారి విస్తరణ పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా కిలో మీటర్ కూడా పూర్తి కాకపోవడంతో వాహన చోధకులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు. నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని దెగుల్‌వాడి క్రాస్ రోడ్స్ నుంచి సిర్గాపూర్ వరకు 12 కి.మీల రోడ్డును విస్తరించడం కోసం 2023 సెప్టెంబరు 19న రూ.15 కోట్లతో పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు పనులను అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ పనులు చేపట్టిన కన్‌స్ట్రక్షన్ కంపెనీవారు రోడ్డు విస్తరణ కోసం కొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేపట్టారు. కొన్ని చోట్ల మెటలింగ్ పనులు చేసి, అసంపూర్తి దశలో వదిలి వేశారు. దీంతో నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్, నల్లవాగు, కల్హేర్, కామారెడ్డి జిల్లా పిట్లం ప్రాంతాలకు వెళ్లే వాహన చోధకులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే కచ్చితంగా ప్రమాదాల బారిన పడతామని పలువురు వాహన దారులు పేర్కొంటున్నారు. రోడ్డు పనులు అసంపూర్తి దశలో వదలి వేయడంతో, ప్రమాదకరంగా మారినా గత్యంతరం లేక ఈ రోడుపైనే ప్రయాణం చేయాల్సి వస్తుందని తుర్కపల్లి, ర్యాకల్, గంగాపూర్, చల్లగిద్ద తండా తదితర గ్రామాల వాసులు అంటున్నారు. తాము అధికారులకు ఫిర్యాదు చేస్తే కాంట్రాక్టర్ రెండు, మూడు రోజులు పనులు చేయించి, తిరిగి వదిలేస్తున్నాడని, అందువల్ల అధికారులు స్పందించి ఈ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు విస్తరణ కోసం వేసిన శిలాఫలకం


గతుకులమయంగా ఉన్న సిర్గాపూర్ రోడ్డు

దేవుడు గుర్తొస్తున్నాడు



నారాయణఖేడ్ నుంచి మా గ్రామమైన ర్యాకల్‌కు వెళ్లాలంటే రోడ్డు పనులు అసంపూర్తి దశలో ఉండడంతో, దేవుడు గుర్తొస్తున్నాడు. నేను ప్రతి రోజు నారాయణఖేడ్‌కు వస్తుంటాను. రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్లడానికి భయంభయంగా వెళ్లాల్సి వస్తుంది.

- మంగలి నర్సింలు

త్వరలో పనులు పూర్తి చేయిస్తాం

నారాయణఖేడ్ - సిర్గాపూర్ రోడ్డు విస్తరణ కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. పనులు అసంపూర్తి దశలో ఉన్న మాట వాస్తవమే. ఇటీవల కాంట్రాక్టర్‌కు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాం. త్వరలోనే పనులు ప్రారంభింప చేసి పూర్తి చేయిస్తాం. పనుల పట్ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు ఇస్తాం.

- నర్సింలు, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి'


ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, సమస్యలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రజావాణిలో 73 అర్జీలు అందాయన్నారు.


ఎనిమిదేళ్ల సమస్యకు పరిష్కారం

హత్నూర మండలం గుండ్ల మాచనూర్ గ్రామానికి చెందిన బేగరి శివయ్యకు సంబంధించిన సర్వే నంబర్ 267-అలో 13 గుంటల పట్టా భూమి ఉంది. అయితే 2018 నుంచి ఇట్టి పట్టా భూమి గత ధరణిలో సాంకేతిక నిషేదిత జాబితాలో ఉందని, ఆ రైతు పలుమార్లు అధికారుల చుట్టు తిరిగి తిరిగి అలసిపోయి చివరి ప్రయత్నంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేక చొరవ తీసుకుని శివయ్య సమస్యను వెంటనే పరిష్కరించారు. తన సమస్యను పరిష్కరించినందుకు రైతు సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు


కిషన్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ వైద్య సిబ్బంది

పుల్‌కల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారు జామున జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి వ్యక్తులకు తీవ్రమైన గాయాలయ్యాయి. మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాకు చెందిన భార్యాభర్తలు జదావత్ కిషన్, సావిత్రిబాయి సోమవారం తెల్లవారు జామున టీవీఎస్ ఎక్సల్‌పై సంగారెడ్డి పట్టణానికి వెళ్తున్నారు. చౌటకూర్ వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి పై ఓవర్ సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యం కుప్పను ఢీకొట్టారు. ఈ సంఘటనలో భార్యాభర్తలిద్దరి కాళ్లు, చేతులకి బలమైన గాయాలయ్యాయి. ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యానికి సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. తాడ్దానిపల్లి గ్రామ శివారులో టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రమైనగాయాలయ్యాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన బేగరి రాజు, బేగరి గోవర్ధన్, శివునాపురం విష్ణు, రమేశ్‌లు బోలేరో వాహనంలో సంగారెడ్డికి వెళ్తున్నారు. ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బేగరి రాజు, బేగరి గోవర్ధన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





సమస్యల పరిష్కారానికి కృషి


ఇందిరమ్మ ఇళ్ల సర్వే తనిఖీలో భాగంగా దివ్యాంగురాలు సంతోషతో మాట్లాడుతున్న కలెక్టర్

మెదక్ అర్బన్/చిలప్‌చెడ్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లోని ప్రజల సమస్యలను మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో భూ భారతి పథకంలో భాగంగా సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టం పై పైలట్ ప్రాజెక్టుకింద చిలప్‌చెడ్ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుంచి సలహాలు సూచనలు భూ సంబంధిత సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 16 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 13 గ్రామాలలో సదస్సులు పూర్తి అయినట్లు తెలిపారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను తప్పని సరిగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తనకు కూడా అవకాశం కల్పించాలని దరిపల్లి సంతోష వికలాంగురాలు కలెక్టరుకు విన్నవించింది.

దివ్యాంగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుగా భవిత కేంద్రాలు మారాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

అమరువీరుల స్థూపం నిర్మాణం కోసం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో 145 సర్వే నెంబర్‌లో స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఔరంగబాద్ శివారులోని సర్వే నెంబర్ 77లోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పోలీసు ప్రజావాణికి 16 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 16 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి


బ్యాట్ పట్టిన మెదక్ ఎస్పీ

లాంగ్ టర్మ్ క్రికెట్ కోచింగ్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మెదక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్యాంపును ఎస్పీ ప్రారంభించారు. పేద పిల్లలు, పోలీస్ సిబ్బంది పిల్లలను కోచింగ్ క్యాంపును వినియోగించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏఆర్ డీఎస్పీ రంగానాయక్, పట్టణ సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం మే 12(ఆంధ్రజ్యోతి): ఐదు ద్విచక్ర వాహనాలను దొంగలించిన నిందితుడిని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట ఏసీపీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ వాసుదేవ రావు, ఎస్సై నవత, సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం 9 గంటల సమయంలో సిద్దిపేట గవర్నమెంట్ హాస్పిటల్ టీ జక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన శనిగరం బైక్ పై వస్తున్న శ్రీకాంత్ అనే వ్యక్తిని ఆపి బైక్‌కి సంబంధించిన పేపర్లు చూపించమని అనగానే మోటార్ సైకిల్ వదిలిపెట్టి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా శ్రీకాంత్ బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. గత సంవత్సరం మే నెలలో సిద్దిపేట ఏరియా హాస్పిటల్ పార్కింగ్ నుంచి ఈ బైకును దొంగతనం చేసి నడుపుకుంటున్నానని తెలిపాడు. అదేవిధంగా ఈ సంవత్సరం జనవరిలో సిద్దిపేట కోటిలింగాల టెంపుల్ ముందు పార్కు చేసిన ఏపీ 36 ఏ 1586 బైక్‌ను , ఈనెల 3, 10వ తేదీలన రైతు బజార్ నుంచి టీవీఎస్ రాడాన్ బైక్‌ను, హోండా షైన్ బండిని, తదుపరి దుబ్బాక హబ్సిపూర్ చౌరస్తా వద్ద పార్కు చేసిన స్ప్లెండర్ ఏపీ 10 ఏఎన్ 6920 బైక్‌ను దొంగలించానని ఒప్పుకున్నాడు. వాటిని ఎక్కువ రేటుకు అమ్ముకుందామని ఇంటిలో దాచి పెట్టానని తెలుపగా, పోలీసులు అతని స్వగ్రామానికి వెళ్లి 5 బైకులను స్వాధీనం చేసుకున్నారు .(స్వాధీనం చేసుకున్న బైకుల విలువ 2,55,000) నిందితుడిని అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో సీసీ కెమెరాలు టెక్నాలజీ ద్వారా ఇన్స్పెక్టర్, పోలీస్ సిబ్బంది కీలకపాత్ర వహించారని త్వరలో అందరికీ సీపీ చేతుల మీదుగా రివార్డు అందజేస్తామని ఏసీపీ తెలిపారు

గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

జహీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కమలమ్మ(67) సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. రోజు మాదిరిగానే ఆమె సోమవారం ఉదయం గ్రామశివారులో ఉపాధిహామీ పనులుచేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో గుండెనొప్పి రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందిందని ఏపీవో అశోక్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

వర్గల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కూతురు వివాహం కోసి చేసిన అప్పుల బాధతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామానికి చెందిన సాయిల సుశీల (44) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. సంఘటనకు సంబంధించి గౌరారం పోలీస్‌స్టేషన్ ప్రొబేషనరి ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాలు మేరకు. మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన సాయిల అశోక్‌కు భార్య సుశీల, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతూరు వివాహం కోసం చేసిన అప్పుతో బాధపడుతూ సుశీల తీవ్ర మనస్తాపం చెందేదని తెలిపారు. అప్పు ఎలా తీర్చేదని బాధపడుతూ ఆదివారం ఉదయం వారి వ్యవసాయ పొలం వద్ద సుశీల గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కీర్తి తెలిపారు.





భూలక్ష్మమ్మ జాతరలో హోరాహోరీగా కుస్తీ పోటీలు

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర అంగరంగా వైభవంగా కొనసాగుతున్నది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీల్లో సాధారణంగా పహిల్వాన్‌లు, బాలురు మాత్రమే తలపడతారు. ఈ పోటీల్లో బాలికలు సైతం సత్తాచాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చిన శిరీశ, సంగీత, గీత, మహారాష్ట్రకు చెందిన పల్లవి కుస్తీ పోటీల్లో పాల్గొనగా, వారిని జనాలు చప్పట్లతో ప్రోత్సహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు నిర్వహించగా, విజేతలకు రూ.10 నుంచి రూ.100, రూ.500, రూ.1000 వరకు కుస్తీ పోటీని బట్టి నగదు బహుమతిని అందించారు. చివరి కుస్తీ పోటీ విజేతకు రూ.5000 అందజేశారు.


తుర్కపల్లిలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కన్నులపండుగగా ఎడ్లబండ్ల ప్రదర్శన

గడిపెద్దాపూర్‌లో మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడిపెద్దాపూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శనను కన్నులపండుగగా నిర్వహించారు. గ్రామంలోని మల్లికార్జునస్వామి జాతర సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా భక్తుల ఎడ్లబండ్లను రంగు రంగుల పూలు, వివిధ రకాల క్లాత్‌లతో అలంకరించి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శించి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం ఆలయం చుట్టూ ఐదు ప్రదర్శనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కులను తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి అల్లర్లు జరగకుండా స్థానిక సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డితో ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


మల్లికార్జునస్వామి


గడిపెద్దాపూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన

మైనింగ్ మాయ.. మట్టి మాఫియా

రాంపూర్‌లో ఆగని దందా.. పట్టించుకోని అధికారులు

కొల్చారం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్‌లో ఓవైపు బ్లాస్టింగ్‌లతో క్రషర్ వ్యాపారులు దడ పుట్టిస్తుంటే.. మరోవైపు మట్టిని కొల్లగొడుతూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులను తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన క్రషింగ్ చేపడుతున్నా.. గుట్టలను తవ్వేస్తూ టిప్పర్లలో మట్టిని రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

ఇష్టారీతిన క్రషింగ్

బ్లాస్టింగ్‌లతో పక్కనే ఉన్న రాంపూర్ గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈనెల 1న 'గోరంత అనుమతి.. కొండంత తవ్వకాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో మైనింగ్ మాయ గురించి ప్రచురితమైంది. రాంపూర్ గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఈ కథనంపైనే చర్చ జరిగింది. క్రషింగ్‌తో వెలువడుతున్న దుమ్ముధూళితో పంటలు పాడుతున్నాయని, బైక్‌లపై వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. తరచూ టిప్పర్‌లు వస్తూ, పోతూ ఉండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' తమ సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చినా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అండదండలతోనే ఇష్టారీతిన క్రషింగ్ చేస్తున్నారని, అనుమతి లేకుండానే టిప్పర్‌లలో కంకర తరలిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.




రాంపూర్ శివారులో తవ్వేస్తున్న గుట్టలు, ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతూ టిప్పర్‌లోకి వేస్తున్న మట్టి

మట్టి.. కొల్లగొట్టి

రాంపూర్ గ్రామ శివారులోని 373 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మట్టిని కొల్లగొడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తున్నారు. రోజు టిప్పర్లలో తరలిస్తూ మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటున్నది. స్థానికంగా ఓ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వెంచర్ కోసం ప్రభుత్వ భూమి నుంచే అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు. ఒక సామాన్యుడు ఇంటి నిర్మాణం కోసం మట్టిని తరలిస్తే రెవెన్యూ అధికారులు కేసులు చేస్తారు. కానీ ఏకంగా టిప్పర్లతోనే తరలిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నర్సరీ, వైకుంఠధామం మధ్య దారిలో నుంచి యథేచ్ఛగా టిప్పర్లు వెళుతుంటే ఏం చేస్తున్నారని మండిపడుతున్నారు. నర్సరీలో ఉన్న మొక్కలపై దుమ్ము పడడంతో ఎదగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా నల్లమట్టి తరలింపు

హత్నూర, మే 12 (ఆంధ్రజ్యోతి) : హత్నూర శివారులోని సాకి చెరువు నుంచి కొందరు నల్లమట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. వ్యవసాయ భూమిలో గుంతల పూడ్చుకునేందుకు అని చెబుతూ సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్లను పెట్టి వందల ట్రిప్పుల మట్టిని తరలించారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు అన్ని అనుమతులు ఉన్నాయని సమాధానం ఇస్తూ మట్టిని కొల్లగొడుతున్నారు. అధికారులు పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.


సాకి చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌లు

ఎక్స్‌కవేటర్ సీజ్

నర్సాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్ సమీపంలో మట్టి తవ్వకాలపై సోమవారం రెవెన్యూ, మైనింగ్, పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేశారు. సర్వే నంబరు 134లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వారు దాడులు చేశారు. తీసిన గుంతల నుంచి ఎంతమేర మట్టి తరలించారనే విషయమై లెక్కలు తీసి, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

టీబీ బాధితుల రికార్డులు

సక్రమంగా నిర్వహించాలి

డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ప్రతినిధులు


సంగారెడ్డి టీబీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ప్రతినిధులు

సంగారెడ్డి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : టీబీ బాధితుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ప్రతినిధులు సూచించారు. సంగారెడ్డిలోని టీబీ కార్యాలయాన్ని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ స్నేహశుక్లా, స్టేట్ టీబీ ట్రైనింగ్ అండ్ డిమోనిస్ట్రేషన్ సెంటర్(ఎస్‌టీడీసీ) ఎపిడమాలజిస్ట్ డా.రాజేశ్వరి సోమవారం సందర్శించారు. 2024 ఏడాదికి సంబంధించి టీబీ పేషెంట్ల ట్రీట్‌మెంట్ కార్డులు ట్రీట్‌మెంట్ యూనిట్ వాకీగా వెరిఫికేషన్ చేశారు. జిల్లాలో 36 డ్రగ్ రెసిస్టెంట్ కేసులపై ఆరా తీశారు. టీబీ పేషెంట్లకు సకాలంలో మందులు అందించాలని, ట్రీట్‌మెంట్ ఫాలోఅప్ చేయాలని సూచించారు. వారి వెంట డీటీసీవో డా.అరుణకుమారి, టీబీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రైతు ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మనోహరాబాద్ మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు ఐడీ విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని కోనాయపల్లి గ్రామంలో ఏఈవో నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డును అందజేస్తున్నారు. రైతు ఐడీలో 11 అంకెల నంబర్, పేరు, ఆధార్, ఫోన్ నంబర్, పాస్‌బుక్ వివరాలు, భూమి రకం, సర్వే నంబర్లు, సాగు చేసిన పంట తదితర వివరాలుంటాయని ఏఈవో తెలిపారు. కేంద్ర పథకాలైన కిసాన్ నిధి, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డులకు ఈ కార్డు తప్పనిసరి, లేకపోతే ఆయా పథకాలు అందవని పేర్కొన్నారు. ప్రతి ఒక్క రిజిస్ట్రేషన్ చేసుకుని డిజిటల్ గుర్తింపు కార్డును పొందాలని ఆయన సూచించారు.


కోనాయపల్లిలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

హైవేల విస్తరణతో అభివృద్ధికి బాటలు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు పడతాయని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నేషనల్ హైవే అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారుల విస్తరణ ద్వారా పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రయాణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. తక్కువ సమయంలో గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చన్నారు. సమృద్ధిగా నీరు, విద్యుత్ సౌకర్యాలు, రవాణా సదుపాయం, సరైన సమాచార వ్యవస్థ ఉంటే ఆ ప్రాంతం శరవేగంగా అభివృద్ధిలోకి వస్తుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రఘునందన్‌రావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అవసరమైన మట్టిని చెరువులు, సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఉచితంగా తీసుకోవడం ద్వారా ఆయా ప్రాంతాల రైతులకు ఎంతో మేలు చేసినవారమవుతామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, జాయతీ రహదారుల ఇంజనీర్లు, మెట్రో, విద్యుత్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ద్రోహులకు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ

కంది, మే 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ దేశ ద్రోహులకు మద్దతు ఇస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. సోమవారం జిన్నారం మత ఘర్షణలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తలను కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఎంపీ రఘునందన్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశద్రోహులను వెంటనే పంపించాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికార యంత్రాంగం స్పందించడం లేదని విమర్శించారు. దీంతో దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడిందన్నారు. జిన్నారంలోని కోదండ రామాలయం భూముల్లో అక్రమంగా మదర్సా నిర్మించారని, ఇక్కడి మదర్సాలో బంగ్లాదేశీయులు ఎందుకు ఉంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిన్నారంలో ఏం జరుగుతుందో విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను నాలుగుసార్లు ఎంపీగా అడిగినా సరైన సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు.


కంది జైలు వద్ద మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

నవసమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

సంగారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి) : గౌతమ బుద్ధుడి బోధనలు అందరికీ అనుసరణీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ అన్నారు. జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి గ్రామంలో సోమవారం గౌతమబుద్ధుడి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి జీవితం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని, సమస్త మానవాళికి అహింస, సత్యం గొప్పతనాన్ని చాటి చెప్పిన గొప్పమహనీయుడని కొనియాడారు. బూచనెల్లిలో బుద్ధవిహార్ ఏర్పాటుకు కృషి చేసిన కమిటీ సభ్యులను, గ్రామస్థులను ఎంపీ అభినందించారు. బుద్ధవిహార్ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, టీపీసీసీవో రాష్ట్ర నాయకులు శ్యామ్, సమతా సైనిక్‌దళ్ నాయకులు రవీందర్, నాయకులు కండెం నర్సింహులు, శుక్లవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అత్తర్‌అహ్మద్, నర్సయ్య, జనార్ధన్, మొగులయ్య, రాంచందర్ భీంవంశీ, శ్రీనివాస్, బాల్‌రాజ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎంపీ సురేష్‌షెట్కార్

సిద్ధివినాయక ఆలయంలో ఎంపీ పూజలు

న్యాల్‌కల్,మే 12(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభువుగా వెలసిన సిద్ధివినాయకుడిని సోమవారం జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్ధిలింగయ్యస్వామి తదితరులు ఉన్నారు.

గిరిజన గురుకుల

జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు

సీట్ల భర్తీకి 15, 16వ తేదీల్లో కౌన్సెలింగ్

నర్సాపూర్/హయత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో- ఆర్డినేటర్‌లు గంగారాం, కె.నాగార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16వ తేదీలలో హయత్‌నగర్ కల్వంచ శాంతినగర్‌లోని బాలుర గురుకుల ప్రతిభ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. 15వ తేదీన బాలురకు, 16న బాలికలను కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లాకు సంబంధించి.. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఏఅండ్‌టీ గ్రూపులలో ఖాళీలు ఉన్నాయని, భర్తీకి 15వ తేదీన కామారెడ్డిలోని నాగిరెడ్డిపేట గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, పదో తరగతిలో సాధించిన మార్కుల మెమో, స్టడీ, కండక్టు సర్టిఫికెట్లు, 2024-25 సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించి ఉండరాదని తెలిపారు. ఆధార్ జిరాక్స్ స్పోర్ట్స్, పీహెచ్‌సీ, ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతీ గ్రూపు నందు ఎస్టీ విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, ఓసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ కేటగిరీలో పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు 9502050715, 9603431550 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా వేణుగోపాలస్వామి గరుడ సేవ

శివ్వంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దొంతి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ పూజారి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి గరుడసేవను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ హాజరై పూజలు చేశారు. మహిళలు మంగళహారతితో గరుడ సేవకు స్వాగతం పలికారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై వేణుగోపాలస్వామి

వీరభద్ర స్వామి ఆలయంలో

వైభవంగా చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

గుమ్మడిదల, మే 12 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమిని పురస్కరించుకుని మండలం పరిధి బొంతపల్లిలోని భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో శశిధర్, పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు హోమాన్ని నిర్వహించారు. అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని హోమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు.

'గౌరవెల్లి' భూనిర్వాసితులకు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చాడ లేఖ

హుస్నాబాద్‌రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సోమవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామస్థులు పెట్టుకున్న అర్జీనీ సత్వరమే పరిష్కరించాలని, ముంపు బాధితులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

సంక్షోభ వసతి గృహాలు

క్రమేపీ దూరమవుతున్న విద్యార్థులు

నెల రోజుల్లో విద్యాసంవత్సరం ప్రారంభం

కలెక్టర్ చొరవ తీసుకుంటే హాస్టళ్ల మనుగడ

మద్దూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. వార్డెన్ల నిర్లక్ష్యం, ఉన్నతధికారుల పర్యవేక్షణ లోపంతో క్రమేపీ విద్యార్థులు దూరమవుతున్నారు. సిద్దిపేట జిల్లా లద్నూరులోని ఎస్సీ, బీసీ, ధూళిమిట్టలోని ఎస్సీ, మద్దూరులోని బీసీ హాస్టళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. ఇప్పటికైనా వీటిని పట్టించుకోకపోతే ప్రతీ మండలంలోని సంక్షేమ హాస్టళ్ల గతి ఇలానే మారుతోంది. మరికొన్ని రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో ఈ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చి, వార్డెన్లను కేటాయిస్తే పేద విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

వసతి గృహాల వార్డెన్లు స్థానికంగానే నివాసం ఉంటూ హాస్టళ్లను చూసుకోవాల్సి ఉండగా, పట్టణ ప్రాంతాల్లో నివాసముంటూ ఉన్నతాధికారుల కనుసన్నల్లో మెదులుతూ చుట్టపుచూపుగా వచ్చి పోయేవారు. రికార్డుల్లో విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపడంతో పాటు మెను ప్రకారం భోజనం, కాస్మోటిక్ ఛార్జీలు సక్రమంగా అందించే వారు కాదు.


మద్దూరులో మూతపడిన బీసీ హాస్టల్

బెడ్‌లు, తాగునీటి వసతి సరిగ్గా లేకపోవడం, కిటికీలు, తలుపులు ధ్వంసం కావడం తదితర కారణాలతో విద్యార్థులు క్రమేపీ హాస్టళ్లకు దూరమవుతూ వచ్చారు. ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చినా, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా అధికారులు పర్యవేక్షణ లోపంతో ప్రయోజనం లేకుండా పోయింది. హాస్టళ్ల పనితీరులో మార్పునకు ఏమాత్రం దోహదం చేయలేదు. వార్డెన్లు లేని చోట ప్రభుత్వం ఇన్‌చార్జీ వార్డెన్లకు బాధ్యతలను అప్పగించడంతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. గతంలో ప్రభుత్వ ఆదేశానుసారంగా స్థానిక తహసీల్దార్లు రాత్రిళ్లు హాస్టళ్లను విజిట్ చేసి నిద్రకు ఉపక్రమించేవారు. సమస్యలపై విద్యార్థులను ఆరా తీసి, వార్డెన్ల పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదిక అందించేవారు. ఆ పరిస్థితులు క్రమేపీ కన్పించకుండా పోవడంతో హాస్టళ్లే కనుమరగవుతున్నాయి.

చొరవ చూపితే..

ఇటీవల ధూళిమిట్ట మండల కేంద్రంలో మూతపడిన హాస్టల్ దుస్థితిపై స్థానిక నాయకులు, గ్రామస్థులు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వసతి గృహాన్ని సందర్శించి, వచ్చే అకడమిక్‌కు కావల్సిన వసతులు సమకూర్చి పునఃప్రారంభమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటుగా మద్దూరు మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన వసతి గృహంపై కూడా దృష్టి సారించాలని కోరుతున్నారు. జిల్లాలో సమస్యలతో సతమవుతున్న హాస్టళ్లను గుర్తించి, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కావల్సిన సౌకర్యాలను సమకూర్చేలా చూస్తే హాస్టళ్లు బాగుపడే అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

క్షతగాత్రులకు పరామర్శ

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిప్రి గ్రామానికి చెందిన ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి, చందర్‌నాయక్ దంపతులు ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వైద్యశాలలో చికిత్స పొందాక డిశ్చార్జి అయి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ గ్రామానికి వెళ్లి, వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

గిరిజన గురుకుల కళాశాల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

జిన్నారం, మే 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈనెల 15న టెస్ట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు హైదరాబాద్ హయత్‌నగర్‌లో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మురళీనాయక్‌కు నివాళులు

జిన్నారం, మే 12 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ జరిపిన దాడిలో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు మాధారంలో నియోజకవర్గ స్టూడెంట్ అధ్యక్షుడు విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగిన సప్తాహ

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి బాణాపూర్‌లోని రుక్మిణీ పాండురంగ ఆలయంలో 22వ అఖండ హరినామ సప్తాహ రెండోరోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రవచనం, హరిపాఠ్, కీర్తన, మరాఠీ, తెలుగులో భజనలు, కాకడహారతి, గాథపూజ, తీర్థ, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

చిన్నశంకరంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దీప్లారాథోడ్ పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

విద్య, ఆరోగ్యానికే ప్రాధాన్యం

రేగోడు, మే 12 (ఆంధ్రజ్యోతి) : విద్య, ఆరోగ్యానికే మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాధాన్యం ఇస్తున్నారని రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, పార్టీ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు అన్నారు. రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ దత్తారెడ్డితో కలిసి పంపిణీ చేశారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

తూప్రాన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 11 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగించినట్లు తూప్రాన్ సీఐ రంగ కృష్ణ వివరించారు. తూప్రాన్ ప్రాంతంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్‌లో నమోదు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి 11 ఫోన్లను బాధితులకు అప్పగించామని చెప్పారు. ఫోన్లు రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించిన క్రైమ్ టీమ్ కృష్ణ, దుర్గేశ్‌ను సీఐ రంగ కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

మెదక్‌ను అభివృద్ధి చేశాం



చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట మే 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోని మెదక్‌ను అభివృద్ధి చేసి నిరూపించామని ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండల కేంద్రంతోపాటు జంగరాయి, చందంపేట, మడూర్, శాలిపేట తదితర గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో మడూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాజేశ్వరీ(570) మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలవడంతో ఆమెను ఎమ్మెల్యే సన్మానించారు. దర్పల్లిలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరలో ఎమ్మెల్యే పాలొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ వెంకటరాజాగౌడ్, తహసీల్దార్ మన్నన్, ఎంఈవో పుష్పవేణి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించాలి

- తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి
- ఆలయాల పునరుద్ధరణకు నిధులు : ఎమ్మెల్యే



గొల్పర్తి పెద్దమ్మ ఆలయంలో పద్మారెడ్డి పూజలు

రామాయంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ, భక్తి భావన పెంచుకోవాలని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ప్రవచించారు. రామాయంపేట మున్సిపల్ పరిధి గుల్పర్తి పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో మాధవానందతో పాటు కామారెడ్డి జిల్లా టేక్రియాల ఆశ్రమం కృష్ణానందస్వామి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌ను ఆలయ కమిటీ సత్కరించింది. ప్రభుత్వం ఆలయాల పునరుద్ధరణకు పుష్కలంగా నిధులు వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ తైబజార్ వేలం వాయిదా

- ఆసక్తి చూపని డిపాజిట్‌దారులు
- నాలుగుసార్లు అదే తంతు



వేలం వాయిదాను ప్రకటిస్తున్న మున్సిపల్ కమిషనర్

రామాయంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట తైబజార్ వేలం నాలుగోసారి కూడా వాయిదా పడింది. సోమవారం డిపాజిట్ దారులు ముందుకు రాలేదు. దీంతో మరోమారు వేలం వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఎప్పటిలాగే వేలం కోసం బహిరంగ ప్రకటన చేశారు. పోయిన ఏడు రూ.20 లక్షలు పలకడంతో పాట దక్కించుకున్న వారు నష్టాలు చవిచూశారు. నిబంధనల ప్రకారం ఇపుడు అంతకన్నా తక్కువకు దక్కించుకునే వీలు లేదు. దీనివల్ల డిపాజిట్ చెల్లించి నష్టపోవడం ఎందుకని ఎవరూ ఆసక్తి చూపటం లేదు. వేలం వేయనందున ఇప్పటికీ రెండు మాసాలుగా మార్కెట్లో తైబజార్ వసూళ్ల చేయడం లేదు. దీనివల్ల చిరు వ్యాపారులు, రోడ్ల వెంట సీజనల్ పండ్లు అమ్ముకునే వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మెదక్ మున్సిపల్‌లాగా రామాయంపేటలోనూ తైబజార్ రద్దు చేయాలని వ్యాపారులే కాదు, ప్రజానీకం వేడుకుంటున్నది. మెదక్ ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఎందుకు సహకరించాలని కోరుతున్నారు.

పురిటినొప్పులొచ్చినా పట్టించుకోరా..?

- ఆశావర్కర్లపై కుటుంబసభ్యుల ఆగ్రహం
- మండల వైద్యాధికారికి ఫిర్యాదు

చిన్నశంకరంపేట మే 12 (ఆంధ్రజ్యోతి) : పురిటినొప్పులొచ్చినా పట్టించుకోరా అని చిన్నశంకరంపేట మండలం శాలిపేటకు చెందిన బున సంజన కుటుంబసభ్యులు ఆశావర్కర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన సంజన నిండు గర్భిణి. ఆదివారం పురిటినొప్పులతో బాధపడుతుడగా.. మెదక్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేందుకు గ్రామానికి చెందిన ఆశావర్కర్లకు సమాచారమందించారు. అయితే వారు తమకు పట్టనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. దీంతో సంజన సోమవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా గ్రామంలో ఇద్దరు ఆశావర్కర్లు ఉన్నా సేవలందించడం లేదని మండల వైద్యాధికారి సాయిసింధుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సాయిసింధు మాట్లాడుతూ ఆశావర్కర్లు గ్రామాల్లో సేవలందించాలని సూచించారు.

యూరియా, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ కీటక శాస్త్రవేత్త



తూప్రాన్ (రావెల్లి)లో రైతులకు అవగాహన కల్పిస్తున్న డా. రాజశేఖర్

తూప్రాన్/హవేళిఘణపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లిలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రైతుల యూరియా, రసాయన, పురుగు మందులు వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో గంగుమల్లు, ఏఈవో సంతోష్, మాజీ కౌన్సిలర్ రాజు, రైతులు పాల్గొన్నారు. రైతులు పంటల సాగులో యూరియా తక్కువగా వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని పంటల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శోభ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వన శాఖాధికారి ప్రతాప్‌సింగ్, ఏడీఏ విజయనిర్మల, ఏవో బాల్‌రెడ్డి, వీఎఎస్ నిస్సీ, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం కోర్టులో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించదగ్గ కేసుల గురించి కక్షిదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

భూభారతి రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన: తహసీల్దార్



రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్, ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

కొండాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తుందని కొండాపూర్ మండల తహసీల్దార్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం గుంతపల్లి, మునిదేవునిపల్లిలో మండల రెవెన్యూశాఖ భూభారతి చట్టం అమలు రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఈ సదస్సులో రైతుల, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి, డీటీ ప్రదీప్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐలు రాజు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల పాత్ర గొప్పది

రామాయంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో నర్సుల పాత్ర ఎంతో గొప్పదని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లింబాద్రి కొనియాడారు. నర్సుల దినోత్సవ సందర్భంగా సోమవారం సన్మానించారు. రోగులకు సహనంతో సేవ అందించే గుణం వారిదే అన్నారు.

వ్యక్తి అదృశ్యం

మాసాయిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో చోటు చేసుకున్నది. మండల కేంద్రానికి చెందిన వేషం కుమార్(41) ఈనెల 10 ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య బాలామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

కాలనీల్లో మురుగు సమస్యలు పరిష్కరించండి



ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న సింధూఆదర్శరెడ్డి

రామచంద్రాపురం టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మురుగు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి కోరారు. సోమవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ, ఎల్ఐజీ, ఇక్రిశాట్‌ఫెన్సింగ్ ఏరియాల్లో మురుగు సమస్యలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల అంచనా వ్యయానికి సంబంధించిన పత్రాన్ని అందజేశారు. మ్యాక్ సొసైటీ కాలనీలో పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులను ఒకేసారి చెల్లించినా మళ్లీ బిల్లులు కట్టాలంటూ నోటీసులు వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించాలని కోరారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన గౌతమ బుద్ధుడి జయంతిలో ప్రజాసంఘాల బాధ్యులు

నారాయణఖేడ్/హత్నూర, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం గౌతమ బుద్ధుడి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా, దళిత సంఘాల బాధ్యులు మారుతి, భీంసేన, గాలయ్య, నారాయణ, నర్సింలు, శివాజీ, నగేష్, సాయినాథ్, ఏక్‌నాథ్, తుకారం, పాల్గొన్నారు. హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో బుద్ధపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలిండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాలవేసి ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రాజ్, గ్రామ అధ్యక్షుడు ఎస్.రాజు, నరేష్, శివ, సాయికుమార్, చింటూ, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- నాబార్డ్ డీడీఎం కృష్ణతేజ



సుక్రునాయక్‌తండాలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నాగల్‌గిద్ద/మునిపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా నాబార్డు డీడీఎం కృష్ణతేజ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సక్రునాయక్‌తండాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రూప్‌సింగ్, మాజీ సర్పంచులు దేవారెడ్డి, మనోహర్‌పాటిల్, నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన మునిపల్లితో పాటు పెద్దచెల్మెడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ గంగాభవానీ ఆకాశమంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఆమె వెంట పెద్దచెల్మెడ పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, ఆర్ఐ.సుభాష్, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలుగొద్దు

చిన్నశంకరంపేట/చేగుంట/వెల్దుర్తి/కల్హేర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తహసీల్దార్ మన్నన్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు సూరారం, చందంపేట, గవ్వలపల్లి తదితర గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. చేగుంట మండలంలోని 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ సోమవారం సందర్శించారు. ధాన్యం తరలించేందుకు లారీల సంఖ్య పెంచాలని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అలీ, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు కూల్చివేత



అమీన్‌పూర్‌లో ఆక్రమణలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పటాన్‌చెరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు చేపట్టిన కట్టడాలను అమీన్‌పూర్ రెవెన్యూ సిబ్బంది సోమవారం కూల్చివేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్లు 993, 994లో కొందరు వ్యక్తులు పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగారు. అసైన్డ్ భూమి అని నమ్మించి నోటరీలపై వంద గజాల చొప్పున విక్రయించి గదులను నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న గదులను, బేస్‌మెంట్లను ఎక్స్‌వేటర్‌తో నేలమట్టం చేశారు. మొత్తం మూడు గదులు, ఐదు బేస్‌మెంట్లను తొలగించామని తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కొనుగోలు చేసి ఎవరూ మోసపోకూడదని తహసీల్దార్ సూచించారు.

పార్కుల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్



బాలవిహార్ పార్కులో అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పార్కుల్లో సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాసనగర్ బాలవిహార్ పార్కులో సౌకర్యాల కల్పన పనులను పరిశీలించి మాట్లాడారు. అన్ని కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఖాళీగా ఉన్న స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రజాపయోగానికి వినియోగిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సురేష్, ఏఈ దివ్యతేజ, మల్లేష్, పీటర్, సామ్రాట్, హనుమంతు, నవీన్‌యాదవ్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ జలాలతో పంటలు దెబ్బతింటున్నాయి

- పీసీబీకి రైతుల ఫిర్యాదు



శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

హత్నూర, మే 12 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో గల కోవాలెంట్ లాబొరేటరీస్ పరిశ్రమ విచ్చలవిడిగా విషజలాలు విడుదల చేస్తుందని రైతుల పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం పీసీబీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అదేవిధంగా పరిశ్రమ పరిసరాల్లో ఉన్న వ్యర్థ జలాల శాంపిల్స్ సేకరించారు. పరీక్షల అనంతరం వచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు వారు స్పష్టం చేశారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



గంగకు వెళ్తున్న భక్తులు

పుల్‌కల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్‌లో వెలసిన రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీపంలోని మంజీరా నదికి వెళ్లి గంగామాతకు పూజలు నిర్వహించి, తెప్పోత్సవం చేపట్టారు. రెండురోజుల పాటు జాతర జరగనుండడంతో పండుగ వాతావరణం నెలకొన్నది.

బీమాతో బాధితులకు ధీమా

నారాయణఖేడ్, మే 12 (ఆంధ్రజ్యోతి) : బీమా ఆపత్కాలంలో ధీమానిస్తుందని ఖేడ్ ఎస్‌బీఐ జీవిత బీమా శాఖ మేనేజర్ రాజురెడ్డి అన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధి చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన అంకం అశోక్ రూ.10 లక్షలకు సంబంధించి స్మార్ట్ కాలర్ బీమా చేయించారు. ఇటీవల ఆయన మృతిచెందడంతో నామినీగా ఉన్న అతడి భార్య అంకం లక్ష్మికి మేనేజర్ సోమవారం రూ.10 లక్షలకు సంబంధించిన బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ సీనియర్ ఏజెన్సీ మేనేజర్ అశోక్, లైఫ్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

నిఘానేత్రాన్ని కమ్మేసిన తీగలు



సీసీ కెమెరాను చుట్టేసిన పచ్చటి తీగ ఆకులు

జిన్నారం, మే 12 (ఆంధ్రజ్యోతి) : నిరంతర నిఘా కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాకు తీగల ఆకులు కమ్మేశాయి. గడ్డపోతారం మున్సిపాలిటీ పారిశ్రామిక వాడలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలావరకు పని చేయడం లేదు. ఓ చోట విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన నిఘానేత్రానికి తీగలతో కూడిన ఆకులు కమ్మేయడంతో అక్కడ సీసీ కెమెరా ఉందా అనే అనుమానం కలుగుతోంది. అధికారులు స్పందించి తీగలను తొలగించాలని కోరుతున్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- రోడ్డుపై విరిగిపడిన చెట్లు



రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న వాహనదారులు

ఝరాసంగం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కుప్పనగర్, మాచునూర్, క్రిష్ణాపూర్ గ్రామాల్లో సోమవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. చెట్లు రోడ్డుపై పడడంతో వాటిని అధికారులు సిబ్బందిచే తొలగించారు. చేతికి వచ్చిన జొన్న పంట నేలకొరగడంతో నష్టం వాటిల్లింది. వర్షం వల్ల ఎండ తీవ్రత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది.